
# జీతకాడి




గుమ్మంలోకి రాగానే ఆలస్యం చెయ్యకుండా అడిగాడు సూర్యనారాయణ.

'శాస్త్రిగారిని కలిశావా? ఏవన్నారు?'

'మామూలే! తప్పకుండా ప్రయత్నిస్తామన్నారు.' నిర్లిప్తంగా సమాధానం చెప్పి బాత్రూంవేపు నడిచాను.

'ఆ మాత్రం భరోసా ఇచ్చాడంటే తప్పకుండా పనిచేస్తాడు. నీకిహ ఉద్యోగం ఖాయంరా! దిగులేం పెట్టుకోకు!' నా వెనకాలే వస్తూ ధైర్యం చెప్పసాగాడు సూర్యనారాయణ; అక్కడికి నేనేదో ఉద్యోగం రాలేదని బెంగపెట్టుకొని కృశించిపోతున్నట్టు.

వీడి మాటలకేమీ సమాధానమివ్వకుండా బాత్రూం తలుపులు వేసేశాను. మద్రాసు ఎండ పట్టించిన చెమటంతా వదిలించుకుంటూ షవర్‌కింద నిలబడితే హాయిగా వుంది. ఒంటికి పట్టిన మకిలీ, మశానం వదిలించుకొని బైటపడేసరికి, అరగంట పైగానే దాటింది. అప్పటికే సూర్యనారాయణ, సరోజ షోగ్గా బట్టలు వేసుకొని తయారయి పోయారు.

'సరోజ ఏదో నెక్లెసు కొనాలంటోంది. ఆపని అయినతర్వాత అటు నించి ఏదైనా సినిమాకు వెళ్దామనుకుంటున్నాం...... త్వరగా బట్టలు వేసుకొని నువ్వుకూడా రాకూడదూ?' హడావుడిగా బూటులేసులు బిగుంచుకుంటూ అన్నాడు సూర్యనారాయణ.

'సారీ! మీరిద్దరూ వెళ్లిరండి' అన్నాను. ఏదో మొహమాటపు ఆహ్వానంలా వుంది వాడి పిలుపు.

'సరే, అయితే వెళ్తున్నాం! మా కోసం ఎదురు చూడకుండా భోంచేసెయ్యి!' అంటూ భార్య నడుంచుట్టూ చెయ్యివేసి అతిసుకుమారంగా నడిపించుకుంటూ తీసుకెళ్లాడు.

అటువేపే చూస్తున్నాను. కాళ్లల్లో బలంలేక నడవలేకపోతున్న రోగిని పట్టుకొని నడిపించి నట్లుగా, సూర్యనారాయణ అలా ఎందుకు చేస్తున్నాడో నాకర్థం కాలేదు. అంత దగ్గరగా వుండటం మూలంగా ననుకుంటాను, ఒకరి కొకరు అడ్డం పడుతూ అప్పుడప్పుడూ తూలుతున్నారు.

నవ్వు బిగపట్టు కొందామన్నా చేతకాలేదు. పెద్దగా వినిపించిన నా నవ్వుకు చేస్తున్న వంట ఆపి ఆర్ముగం పరుగెత్తుకుంటూ వచ్చి చూసి, వెళ్లిపోయాడు.

మెల్లిగా రోడ్డుమీదకు నడిచాను. వీధి చివరనున్న తంగచ్చన్ కొట్లో పనామా సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె కొనుక్కొని వరండాలో వున్న ఈజీచైర్‌లో కూలబడ్డాను.

వేనూ, సూర్యనారాయణ కాలేజీలో

కాలుగేళ్ళు, యూనివర్సిటీలో రెండేళ్ళు కలిసి చదువుకున్నాం. వీడు బి.కాం. పాసవగానే వీడినాన్న కాళ్ళు తేలేసి, 'అబ్బాయి నిన్ను చదివించడం ఇహ నావల్లకాదు.' అన్నాడు. సరిగ్గా ఆ సమయంలో ఆపద్బాంధవుడిలా ఊడిపడ్డాడు సూర్యనారాయణ మేనమామ. మేనల్లుడికి తనే పై చదువులు చెప్పిస్తానన్నాడు. చదువుకయ్యే ఖర్చు ఇవ్వడానికి ముందు, బహానగా తన కూతురు సరోజ నిస్తానన్నాడు. ఇహ వెనకా ముందూ చూడకుండా తలకాయ గట్టిగా వూపాడు సూర్యనారాయణ. అంతే, ఢామ్మని పెళ్లి జరగడం, వీడు ఎం.కాం.లో చేరడం క్షణాల్లో జరిగిపోయాయి.

అదుగో, అప్పటినించే సూర్యనారాయణ మేనమామ, ప్రస్తుతం పిల్లనిచ్చిన మామ అయిన బ్రహ్మానందాన్ని చూస్తే నాకు మంట. తన కూతురికి తక్కువ ఖర్చులో పెళ్లి చేయడానికి సూర్యనారాయణకు చేసింది సహాయం అనడం హాస్యాస్పదంగా కనిపించింది నాకు. పోనీ, ఏ ఉద్దేశ్యంతో చేసినా మంచిపని, మంచిదే ననుకుందాం. అయినా, అంత మంచిపని చేయడానికి, సూర్యనారాయణకంటే బోలెడు అర్హతలు ఎక్కువగా వున్నవాళ్లను లక్షమందిని చూపగలను. ఇప్పటికైనా, తన రెండో కూతుర్ని అటువంటి వాళ్లలోని ఒక్కడికైనా ఇచ్చి, అలా వచ్చిన అల్లుడికి చదువు చెప్పించొద్దు, ఓ చిన్న వుద్యోగం (అంటే నెలకో అయిదువందలు తెచ్చేది) ఇప్పించడానికి ఒప్పుకుంటాడా?...అలా ఒప్పుకొనే పక్షంలో నాకేనాడో ఉద్యోగం దొరికుండేది.

ఎం. కాం. పాసయిన వెంటనే అల్లుడికో వుద్యోగం మద్రాసులో వేయించి, అక్కడ టి. నగర్‌లోవున్న తన స్వంతయింట్లో మకాం పెట్టించాడు బ్రహ్మానందం. ప్రస్తుతం సూర్యనారాయణ పని మూడు పువ్వులు, ఆరుకాయలుగా వుంది ... అందమైన భార్య (ఏమాట కామాటే చెప్పుకోవాలి సరోజ చాలా, చాలా అందంగా వుంటుంది), అందమైన ఉద్యోగం, అందమైన ఇల్లు ... ఇంతకీ, సూర్యనారాయణ అదృష్టవంతుడు.

దీర్ఘంగా నిట్టూర్చాను. గాడితప్పిన ఆలోచనలను సరైన దారిలో పెట్టడానికి ప్రయత్నించాను.

బ్రిల్ సిరా
మీ వ్రాతకు వన్నె నిస్తుంది
తయారు చేయువారు:
ఇండస్ట్రియల్ రిసెర్చి కార్పొరేషన్
మద్రాసు-41 మరియు బెంగుళూరు-3

శాలోఫెన్
బాధానివారిణి మాత్రలు
అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారీవు
తలనొప్పి, ఫ్లూను వెంటనే నిలిపివేయండి!
పంటినొప్పి, ఒళ్లునొప్పులని కూడా
వెంటనే పోగొట్టండి!
బజారులోకి తాజాగా వచ్చిన
శాలోఫెన్ మాత్రలలోని
ఔషధాలు డాక్టర్లు
సిఫార్సు చేసేవే.
శాలోఫెన్ ఉన్నచోట
బాధ ఉండదు.


FDSAS-1809 TE

తప్పు. ఇంకొకడి అదృష్టం, అందులోనూ ప్రాణస్నేహితుడి అదృష్టానికి అసూయ పడకూడదు. వాడిపెళ్ళాం అందం గురించి ఆలోచించకూడదు,' అంటూ మనసును మందలించాను. అంతేకాకుండా, చిన్నప్పుడు ఎలిమెంటరీ స్కూల్లో నేర్చుకొన్న నీతిపద్యాలు గుర్తు తెచ్చుకొని వల్లించడం మొదలుపెట్టాను. 'అపకారికి నుపకారము నెపమెన్నక సేయువాడు...' మొట్టమొదటగా ఈ పద్యమే ఎందుకు గుర్తుకొచ్చిందో నాకు తెలియదు.'

రోడ్డువేపు దృష్టి సారించాను. బంయ్, బంయ్‌మంటూ మోటారు సైకిళ్ళూ, స్కూటర్లూ వెళ్ళిపోతున్నాయి. వెనక పెళ్ళాల్ని కూర్చోపెట్టుకొని అతి వేగంగా పోతున్నారు. పడిపోతామేమోనన్న భయంతో కాబోలు, మొగుడి నడుంచుట్టూ చేతులువేసి, బరువంతా అతగాడి మీద ఆన్చి, పైటలు జార్చి ఆడాళ్ళు కూర్చున్నారు. ఆ దృశ్యం చూడముచ్చటగా వుంది.

'ఆ ఆడాళ్ళపైటలు అలా ఎందుకు జారిపోయాయి? ... గాలి మూలంగానా?' నాకు నమ్మ బుద్ధికావడంలేదు. ముందు కూర్చున్న మొగుడు చూడలేడు కదాని ధైర్యం.' అంతే.

నాకు ఉద్యోగం దొరికి, మోటారు సైకిల్ కొనే తాహతు వచ్చినా, నాపెళ్ళాన్ని మాత్రం ఎప్పుడూ ఎక్కించుకోను..అయినా అలా ఒక ఆడది వళ్ళంతా మొగాడిమీద ఆనించి కూర్చుంటే, ఆ మొగవెధవకు రోడ్డుమీద, డ్రైవింగ్ మీద ధ్యాస వుంటుందా? అందుకే కాబోలు, మద్రాసు పట్నంలో స్కూటర్ల ఆక్సిడెంట్స్ మహా ఎక్కువగా జరుగుతున్నాయి!

బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ గడియారం చూసుకున్నాను. తొమ్మిది కావస్తోంది. ఆకాశంలో చంద్రుడు బ్రహ్మాండంగా వెలుగుతున్నాడు. కుర్చీలోనుంచి లేచాను.

భోజనం ముగించుకొని వచ్చేసరికి రోడ్డుమీద జనం గుంపులు, గుంపులుగా వెళ్ళిపోతున్నారు. రాజకుమారి థియేటర్‌లో మొదటి ఆట అయిపోయి నట్టుంది. నడుస్తున్న కొంతమంది ఏదో పాట ఈల వేస్తున్నారు. మరి కొంతమంది అప్పుడే

# చీకటి

చూసిన సినిమా హీరోలా నడుస్తూ, అనుకరణలో తమకున్న ప్రావీణ్యం చూపించేస్తున్నారు.

మళ్ళీ కుర్చీలో జారగిలబడి సిగరెట్టు ముట్టించాను. ఏవేవో బస్సులు వస్తున్నాయి, వెళ్తున్నాయి. బస్సు వచ్చినప్పుడల్లా నిలబడ్డ మనుష్యుల సంఖ్య కొద్ది కొద్దిగా తరుగుతోంది. మరొక్క ముగ్గురు ఆడాళ్ళు నిలబడి వున్నారు...పాపం! వాళ్ళ బస్సు ఎప్పుడొస్తుందో? అసలొస్తుందో, రాదో?...రాకపోతే?...వాళ్ళను పిలిచి ఈ రాత్రికి ఇక్కడ పడుకోమంటే సరిపోతుంది. సూర్యనారాయణ అడ్డు చెప్పడనుకుంటాను. కానీ వాడి భార్య?...

ఉద్యోగం లేకపోవడంవల్ల జీవితంలో నేనెంత పోగొట్టు కొంటున్నానో అర్థమవుతోంది. నా కిష్టమయిన వాళ్ళను పిలవడానికి కూడా స్వతంత్రం లేదు.

ఎం. కాం. పాసయి రెండు సంవత్సరాలయినా, ఇంతవరకూ ఉద్యోగం రాలేదు, ఏవేవో ఇంటర్వ్యూలకు వెళ్ళడం, రావడం సరిపోతోంది. వారంరోజుల క్రితం మద్రాసు వచ్చాను, డి. సి. యం. వారి ఇంటర్వ్యూకోసం. అది అయిపోగానే సూర్యనారాయణను కలుసుకుంటే, వాడు 'నాకు తెలిసిన వారిద్వారా ప్రయత్నం చేద్దాం, నువ్విక్కడే వుండిపో!' అన్నాడు. ఈవారం నుంచి సూర్యనారాయణ చెప్పిన ప్రతివాడి దగ్గరకెళ్ళి కలుసుకొంటున్నాను.

ఈరోజు ప్రొద్దున్నే శాస్త్రిగారిని కలుసుకున్నాను. ఆయన పి. డబ్ల్యు.డి.లో పెద్ద హోదాలో వున్నాడు. ఫలానా సూర్యనారాయణ ద్వారా వచ్చానని చెప్పగానే ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. ఉద్యోగం సంగతి తప్పకుండా చూస్తానని, ఉద్యోగం ఇవ్వడానికి మరి కొన్నిరోజులు పడుతుంది కాబట్టి, ముందుగా ఇది తీసుకో అంటూ కోకాకోలా ఇచ్చాడు.

శాస్త్రిగారి దయవల్ల ఉద్యోగం వచ్చేస్తే బాగుండును. మంచివాడిలా కనిపించాడు. పెద్ద హోదాలో వున్నప్పటికీ మంచీ మర్యాదా తెలిసిన మనిషి. అవతలవాడి కష్టసుఖాల గురించి ఆలోచిస్తాడు. నా కెందుకో సాయంకాలం నుంచీ ఉద్యోగం వచ్చేస్తుందన్న ధీమా ఏర్పడింది.

ఉద్యోగం వచ్చేస్తే, శాస్త్రిగారి పేరు చెప్పుకొని బస్సు దొరక్క ఇలా రోడ్డుమీద ఒంటరిగా నిలబడిపోయే ఆడాళ్ళకు ఆశ్రయం ఇవ్వొచ్చు. 'ఆడదాని మానాన్ని కాపాడగలిగిన మనిషే మనిషి; వాడే ఉత్తమ మానవుడు. వాడే ఉత్తమ రాజు' అని వేదాలు ఘోషిస్తున్నాయి.

'ఈరోజుల్లో ఎవర్నీ నమ్మలేం!... ఒంటరిగావున్న ఆడది కనిపిస్తే ఏ అఘాయిత్యమయినా చేయడానికి వెనకాడరు'... తతిమ్మావారి నీచబుద్ధిని గర్హించడంతో నాలో సంతోషం పెల్లుబికింది. గబ గబ ప్రహరీగోడ గేటు దాకా వెళ్ళాను, వాళ్ళను పిలుద్దామని. ఇంతలో నల్లటి అంబాసిడర్ కారు వారిముందు ఆగింది. పిలవడానికి తెరిచిన నోరు వెంటనే మూసేశాను.

అయితే వాళ్ళు నిలబడింది బస్సుకోసం కాదన్నమాట...కారులోనుంచి దిగిన మనిషిని పరీక్షగా చూశాను. శాస్త్రిగారు...ఆయన ఏదో మాట్లాడాడు. అందులో ఒకమ్మాయి తల అడ్డంగా వూపి పెదాలు కదిపింది. శాస్త్రిగారు ఏదో మాట్లాడి, కారు డోరు తెరవగానే ఆ అమ్మాయి అందులో ఎక్కింది. కారు వేగంగా కదిలి వెళ్ళిపోయింది, మిగిలిన ఇద్దర్నీ అక్కడే వదిలి.

నాకేం అర్థంకాలేదు. కారులో వెళ్ళిన అమ్మాయి శాస్త్రిగారి భార్య అవడానికి వీలులేదు. ఆయన భార్య చనిపోయి రెండేళ్ళయిందట...'మరి కూతురా?' అదీ అసంభవంగానే కనిపించింది. శాస్త్రిగారి వయస్సు ముప్ఫైఅయిదు దాటదు...పోనీ, ఆ అమ్మాయికి 'లిఫ్టు' ఇచ్చాడేమో అనుకోవడానికి తతిమ్మా యిద్దర్నీ ఎందుకు వదిలేసినట్టు? ...

ఇంతలో ఆర్ముగం వచ్చి, నా పక్కగా నిలబడి 'ఏమిటి - అలా చూస్తున్నావు' అన్నట్టుగా నా వైపు చూశాడు. తలొంచుకొని వరండాలో కొచ్చేశాను.

'అయ్యకి ఇంకా పెళ్ళి కాలేదేమిటి? అటే చూస్తున్నారు!' వెకిలిగా నవ్వుతూ, నా వెనకే వచ్చాడు ఆర్ముగం.

'సిగ్గెందుకు సార్? కావాలంటే చెప్పండి! ధరకూడా తక్కువే!' చేతులు నులుముకుంటూ అమ్మాయిల అందచందాలు వర్ణించడం మొదలు పెట్టాడు.

'నువ్వు చెప్పేది ఆ అమ్మాయిల గురించేనా? వాళ్ళు... వాళ్ళు బజారు..' నమ్మలేకపోతున్నాను.

'వాళ్ళు ఈ వీధిలో వారందరికీ తెలుసు సార్! అమ్మగారు వూర్లో లేనప్పుడు అప్పుడప్పుడూ అయ్యగారి దగ్గరకు కూడా వస్తారు.'

చూడటానికి విద్యావంతుల్లా వున్న వాళ్ళు అలా ఎందుకు మారిపోవాల్సి వచ్చిందో తెలుసుకోవాలనిపించింది. ఆర్ముగం మొదలు పెట్టాడు.

'ఆ ముగ్గురూ అప్పాచెల్లెళ్ళు సార్! పెద్ద అమ్మణ్ణి స్కూల్ ఫైనల్ చదువుతుండగా అప్పా, అమ్మా బస్సు ఆక్సిడెంట్‌లో చచ్చిపోయారు. బంధువులు, స్నేహితులు ఎవ్వరూ లేరు. చెల్లెళ్ళ సాపాటుకు, వాళ్ళ చదువులకు ఇంకో దారిలేక, పెద్ద అమ్మణ్ణి ఈ వ్యాపారంలోకి దిగింది...ఆ తరవాత, స్కూలులోని పిల్లలు 'మీ అక్క భోగంది' అంటూ ఎగతాళి చేసి, ఏడిపిస్తుంటే తతిమా ఇద్దరూ కూడా చదువు మానేసి, కొన్నాళ్ళకు ఇదే వృత్తిలోకి దిగారు.'

ఇక ఆపమన్నట్టుగా చేయి వూపి, కుర్చీలో జారగిలబడి కళ్ళు మూసుకున్నాను. పగలు ఎండలో మర్యాదగా కనిపించే శాస్త్రి రాత్రిళ్ళు చేసేపని ఇదా? ... ఎలాటి

# చీకటి

మొగాడినయినా ఈ ఆడాళ్ళు ఊబిలోకి దింపేయగలరు గదా!... డబ్బుకోసం శీలం అమ్ముకొనే ఇలాటి బజారుముండల్ని ఏం చేసినా పాపంలేదు. పెళ్ళాంపోయి, ఒంటరిగా కాలం గడుపుతున్న శాస్త్రిగారిని ఇదే అదనుకదాని వలలో వేసుకున్నారు...'

నా ఆలోచనలకు నామీద నాకే అసహ్యం వేసింది. ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు గదాని శాస్త్రి చేసే తప్పుడుపని సమర్థించడం ఛండాలంగా అనిపించింది. శాస్త్రి సంగతి అలావుంచి, సూర్యనారాయణ చేసే పనేమిటి? చక్కటి పెళ్ళాం వుండగా ఇలాంటి అడ్డదారులు తొక్కడం...

కళ్ళు తెరచి రోడ్డువంక చూశాను ఆ యిద్దరూ ఇంకా అక్కడే వున్నారా అని. కిళ్ళీకొట్టు తంగచ్చన్ ఏదో మాట్లాడుతున్నాడు. వీడేదో బేరం తెచ్చాడనుకున్నాను ... అనుకున్నట్టుగానే అయింది. మిగిలింది ఒకతే అమ్మాయి. గడియారం చూసుకున్నాను. లాభంలేదు... సూర్యనారాయణ ఏ క్షణంలోనన్నా రావచ్చు.

'పాపం! ఈవిడను తీసుకెళ్ళే అనాథ రక్షకుడెవరో?'

నిజంగానే అనాథరక్షకుడు ఆ చివరినుండి వస్తున్నాడు, లాఠీ వూపుకుంటూ. పోలీసును చూడగానే ఆ చిన్నది అక్కడనుంచి వెళ్ళిపోవడానికి ప్రయత్నించింది. కానీ; అతగాడు కేకవేయడంతో ఆగిపోవాల్సి వచ్చింది. దగ్గరగావచ్చి ఏదో అరవంలో అడుగుతున్నాడు. ఆవిడ సమాధానం చెప్తోంది. వణుకుతున్న కంఠంతో గబగబ మనవి చేసుకొంటోంది. బహుశా దయ చూపమని ప్రార్థించిందనుకుంటాను. కానిస్టేబుల్ అదేమీ పట్టించుకోకుండా పదమన్నట్టుగా జబ్బపుచ్చుకు ముందుకు తోశాడు. ఇహ విధిలేక అతగాడి వెనక బయల్దేరింది.

పాపం! ఇప్పుడు స్టేషన్‌కు తీసుకెళ్తారు. రేపు కోర్టులో నిలబడి, నవ్వటానికేవున్న ఆ కళ్ళలోనుంచి నీరు కారుతుంటే దయ చూపమని ప్రార్థిస్తుంది.


'చూస్తిరా స్వామీ! మీ ఛాన్సుపోయే! త్వరగా తేల్చమంటే నానుస్తూ కూర్చుంటిరి' నొచ్చుకుంటూ అన్నాడు ఆర్ముగం.

'ఆర్ముగం! పోలీస్‌స్టేషన్‌లో ఆ అమ్మాయిని కొట్టార్రా?' అన్నాను, సాధ్యమైనంత విచారం ధ్వనింపచేస్తూ.

'పోలీస్‌స్టేషనుకు కాదుసార్ ఇప్పుడెళ్ళింది; ఇన్‌స్పెక్టర్‌గారింటికి. ఎవరినన్నా బాగున్న పిల్లను తీసుకురమ్మన్నాడట ఆయన, ఇది కనిపించింది. 'రేపు సాయంకాలంలోగా మూడునెలల ఇంటద్దె కట్టకపోతే, సామాను వీధిలో పారేస్తానన్నాడు, బాబ్బాబు రేపొస్తాను. ఈవేళ్టికి వదలండి' అంటే వినిపించుకోకుండా లాక్కుపోయాడు...ఏదైనా, మంచి ఛాన్సు పోగొట్టిరి సార్!' అంటూ లోపలికెళ్ళిపోయాడు ఆర్ముగం.

తలంతా దిమ్ముగా వుంది. పొట్టకూటికోసం ఎన్నిబాధలు! ... హఠాత్తుగా నిన్న చూసిన విషయం గుర్తుకొచ్చింది.

నిన్నరాత్రి ఇల్లాగే వరండాలో కూర్చున్నాను. రెండుకాళ్ళకూ కట్లు కట్టుకొన్న మొగాడ్ని తోపుడబండిలో కూర్చోపెట్టుకొని ఒక ఆడది తోసుకొస్తోంది సరిగ్గా ఆ లాంతరు స్తంభం దగ్గరకు రాగానే ఆ కుంటివాడు గబగబ తన కట్లన్నీ విప్పదీసుకొని నడుస్తూ వెళ్ళి పేవుమెంటుకు ఓ వారగా నిలబడ్డాడు, వళ్ళు విరుచుకుంటూ. కుంటివాడిగా వేషంవేసి ముష్టియెత్తి తెచ్చిన డబ్బు పంచుకోవడంలో తగాదా వచ్చినట్టుంది, ఆ యిద్దరూ చాలా



సేపు పోట్లాడుకొని, ఆ సేపు మెంటుమీదనే ఓమూలగా పడుకొని నిద్రపోయారు.

గేటువేసిన చప్పుడుకు ఉలిక్కిపడి చూశాను. సూర్యనారాయణ, సరోజ వచ్చారు.

'సారీ బ్రదర్! సినిమానుంచి అలా హోటల్‌కువెళ్ళి భోజనం చేయడంతో ఆలస్యమయింది ... నీ భోజనం అయిపోయిందా ?' అయిందన్నట్లుగా తల వూపాను.

'పదకొండు కావస్తోంది; పడుకోరాదూ?' అంటూ లోపలి కెళ్ళిపోయాడు.

అలాగే ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలియదు.

లోపలినుంచి మాటలు వినిపిస్తున్నాయి.

'పగడాల నెక్లెస్సు కొనాలని చాలా రోజులనుంచీ అనుకుంటుంటే, అది ఇప్పటికి తీరింది... అన్నట్టు మొన్న డబ్బడిగితే లేదన్నారు. రెండురోజుల్లో పదిహేను వందలరూపాయలు ఎక్కడినుంచి వచ్చాయండి?' నిగ్గదీసి అడుగుతోంది సరోజ.

'మా కంపెనీ వస్తువుల ఏజన్సీ శాస్త్రి తమ్ముడికి ఇప్పించాను. వాడిచ్చాడీ డబ్బు. అబ్బబ్బ! ఆ రాస్కెల్ వట్టి పిసినారి అనుకో! దర్టీస్కౌండ్రల్! ఈ పదిహేను వందలివ్వడానికి ఏడ్చి చచ్చాడు.' అంత పిసినిగొట్టు దగ్గరనుంచి డబ్బు లాగగలిగానన్న సంతోషం ధ్వనించింది సూర్యనారాయణ గొంతులో.

* * *

త్రీటైరు కంపార్టుమెంటులో నా బెర్తు నంబరు చూసుకొని కూర్చున్నాను. ఉద్యోగం వస్తుందన్న ఆశ వదులుకొని తిరిగి బెజవాడ వెళ్ళిపోతున్నాను.

నా ముందు బెర్తుమీద ఓ యిద్దరు కూర్చున్నారు. 'ఇక్కడైతే హాయిగా




వుంటుంది. అర్ధరూపాయి పారేస్తే హాయిగా కూర్చుని పోవచ్చు!' అంటున్నాడు ఇరవై ఏళ్ల కుర్రవాడు పక్కనున్న నలభై ఏళ్ల పెద్దమనిషితో.

తెలియక ఈపెట్టి ఎక్కారనుకున్నాను. 'చూడండి! ఇది త్రిటైరుపెట్టె. ఇక్కడ కూర్చోనివ్వరు. బెర్తులు మాత్రం వుంటాయి ఒక్కోదానికి నాలుగున్నర రూపాయలు వసూలు చేస్తారు.' అన్నాను.

ఆ ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. 'ఇంకో పెట్టిలో ఎక్కుదామా?' అనుకున్నారు కాసేపు. ఇంతలో బండి కదలడంతో, ఇరవై ఏళ్ల కుర్రాడు 'ఇప్పుడే వస్తాను, వుండు బాబాయి!' అంటూ వెళ్లాడు. మరో పది నిముషాల్లో తిరిగి వచ్చాడు నవ్వుతూ.

'కండెక్టరుతో మాట్లాడాను. అయిదు రూపాయిలిస్తే మనిద్దరికీ బెర్తులిస్తానన్నాడు. హాయిగా పడుకొని వెళ్లిపోవచ్చు' అంటూ గబుక్కున ఆగిపోయి ఆలోచనలో పడ్డాడు. కాసేపటికి తేరుకొని జేబులోనుంచి మూడురూపాయలు తీసి బాబాయి చేతిలో పెట్టాడు.

'కండెక్టరు రాగానే ఈ డబ్బులియ్యి బాబాయి! 'మావాడు తెలియక అయిదు రూపాయలన్నాడు. మూడుకంటే ఎక్కువివ్వను.' అను, సరిపోతుంది' అన్నాడు. బాబాయి సరే నన్నట్టుగా తలాడించి,

# చీకటి

కండెక్టరు రాగానే అలాగే చేశాడు. కండెక్టరు ఏమీ మాట్లాడకుండా ఆ ఇద్దరికీ బెర్తులిచ్చేసి వెళ్లాడు.

ఇదంతా చూస్తున్న నాకు ఏమిటోగా వుంది. ఎక్కడచూస్తే అక్కడ మోసం. ఉద్యోగం యిప్పిస్తానన్న శాస్త్రి, ఎవడో వెయ్యిరూపాయలివ్వగానే తనాఫీసులోని ఉద్యోగం వాడికిచ్చి నాకు మొండిచెయ్యి చూపించాడు...భార్యకు నగలు చేయించడానికి, డాబుగా బ్రతకడానికి లంచాలు తీసుకొని పెద్దమనిషిగా చలామణి అవుతున్న సూర్యనారాయణ ... ఆఖరకు రైలుబండిలో కండెక్టరు కూడా...

ఈ ఆలోచనలతో సరిగ్గా నిద్రపట్టలేదు. సర్కారు ఎక్స్‌ప్రెస్ గుంటూరులో ఆగినప్పుడు రాత్రంతా మనస్సులో దిగులుగా వున్నదెందుకో అర్ధమయింది. నాబాధంతా కండెక్టరు లంచం పుచ్చుకున్నాడని కాదు; నేను వెర్రి వెధవలా బెర్తుకోసం నాలుగున్నర తగలేశాను కదాని.

దాహంగా వుండే మంచినీళ్లు తాగుదామని రైలుదిగి పంపువేపు నడిచాను. నలుగురైదుగురు పంపుచుట్టూ మూగారు. వెనకగా నిలబడి దిక్కులు చూస్తున్నాను. సరిగ్గా పంపు కెదురుగా ఫస్టుక్లాసు పెట్టె వుంది. కిటికీలోనుంచి ఒక అందమైన మొహం పంపుదగ్గర నీళ్లు తాగుతున్న వారిని పరీక్షగా చూస్తోంది. ఆ మొహంలో ఏదో కుతూహలం కనిపిస్తోంది. నాకిహ ఆ పంపుదగ్గర నీళ్లు తాగాలనిపించలేదు.

ఈ రైలు దేవరుకు బుర్ర వున్నట్టు లేదు. ఈ మొదటి తరగతిపెట్టె కొంచెం ముందుగానో, వెనగ్గానో తీసుకెళ్ల కూడదూ?...ఆ అందాలభరిణ, పంపుదగ్గర నీళ్లు తాగుతున్నవాళ్లను వింతజంతువుల్ని చూసినట్టుగా చూస్తుంటే, ఎలా తాగేది ?

ఎదురుగా కనిపిస్తున్న నీళ్లను తాగకూడదనుకొనేసరికి, దాహం మరి కాస్త ఎక్కువయింది. తల నవరించుకుంటూ, కంపార్టుమెంటు దగ్గరగావచ్చి సిగరెట్టు వెలిగించాను. ఒకచేయి చెంపమీద ఆన్చి, కళ్లు విప్పార్చుకొని గమనిస్తున్న ఆందాల పసిడిబొమ్మను చూస్తుంటే మనసంతా అదోలా వుంది. ఇంతలో, నా కల చెదరగొట్టడానికేనన్నట్టు, రెండు చేతులూ లేని ముష్టివాడు ఆవిడను ఓ పదిపైసలు పడెయ్యమని అడుగుతున్నాడు. ఆవిడ వాడిని కసిరికొట్టింది. ఆ అందమైన మొహంలో కనిపించిన కోపం చూసి కాస్త బెరుకు పట్టింది నాకు. ఆ ముష్టివాడు అక్కడనుంచి సరాసరి నా దగ్గరకు వచ్చాడు. జేబులో చెయ్యిపెట్టి వెంటనే తీసేశాను. ఆవిడ నావేపే చూస్తోంది. ఆవిడగారు ముష్టివేయనప్పుడు నేనేస్తే, నా గురించి ఏమనుకుంటుందో? ... చెడుగా అనుకుంటే సహించలేను. వాడిని కాస్త గట్టిగా కసురుకొని పంపించేశాను.

గార్డు పచ్చజెండా వూపగానే బండి కదిలింది. వెంటనే బండెక్కాను.

మళ్లీ సూర్యనారాయణ, శాస్త్రి, కండెక్టరు, ఆ రాత్రి చూసిన ముగ్గురమ్మాయిలు, నా బుర్రలో మెదలడం ప్రారంభించారు. పొట్టకూటికి ఒకరు తప్పుడు పనులుచేస్తుంటే, దర్జాలకోసం, విలాసాలకోసం మరొకరు చేస్తున్నారు.

ఆలోచిస్తున్న నాకు హఠాత్తుగా ఓ అనుమానం వచ్చింది. ఇంతమందిని చెడ్డవాళ్లని అనుకుంటున్నానే, మరి నేనో???... ఏమో!!! ●

